క్లుప్తంగా

వైద్యుల సూచనలు పాటించాలి



తుడుమలదిన్నెలో పశువుకు మందు తాపిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : పాడి రైతులు పశు వైద్యుల సూచనలు పాటిస్తే పాల దిగుబడులు పెంచుకోవచ్చునని పశు వైద్యాధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, నాగశైలజలు అన్నారు. గురువారం మండలంలోని తుడుమలదిన్నె, కాకరవాడ గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 225 గేదెలకు వైద్య పరీక్షలు, కృత్రిమ గర్భాధారణ సూదులు వేశారు. 769 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(అర్బన్): పశువులకు సోకే వ్యాధులపై పెంపకం దారులు అప్రమంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కానాల గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో వెంకటసుబ్బారెడ్డి పాల్గొని పశువులు మేకలు, గొర్రెలకు చికిత్సలు అందించారు. అనంతరం పశువైద్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యులు శ్రీనివాసులు, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌పై దృష్టి పెట్టండి

శిరివెళ్ల: పిల్లల భవష్యత్‌పై దృష్టి పెట్టాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ పిల్లలను కళాశాలకు పంపడేకాక వారు ఏమి చదువుతున్నారు, వారి విద్యా సామర్థ్యాలు ఎంత వరకు ఉన్నాయి, మార్కులు ఎన్ని వస్తున్నాయి, వారి ప్రవర్తిన ఎలా ఉందని విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. యుక్త వయస్సులో పిల్లల ప్రవర్తన చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకే విద్యార్థికి మూడు బహుమతులు



డీఈఓ నుంచి బహుమతి అందుకుంటున్న రాకేష్

శిరివెళ్ల: మోడల్ స్కూల్‌కు చెందిన ఒకే విద్యార్థికి మూడు విభాగాలలో బహుమతులు సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. నంద్యాలలో ఈ నెల 22, 23 తేదీలలో నంది బాలోత్సవాలు జరిగాయన్నారు. ఇందులో పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో 8వ తరగతి విద్యార్థి రాకేష్‌కు జిల్లా స్థాయి లెటర్ రైటింగ్‌లో 3వ బహుమతి, డ్రాయింగ్‌లో 3వ, ఉపన్యాస పోటీలలో రెండవ బహుమతి గెల్చుకున్నాడని చెప్పారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి విద్యార్థికి బహుమతులను అందచేశారన్నారు.

అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్

శిరివెళ్ల: ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ సుధాకర్ హెచ్చరించారు. గురువారం శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న మన గ్రోమోర్, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద ధరల సూచిక బోర్డులను ప్రదర్శించాలన్నారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ అమ్మితే తమ దృష్టికి తేవాలని రైతులను కోరారు. నిబంధనలను ఉల్లంఘించిన దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

కానాల ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బాలగురప్ప అక్రమాలపై డ్వామా కార్యాలయ అధికారులు విచారణ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై కొందరు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం గ్రామంలో సభ నిర్వహించి విచారణ చేపట్టారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు, ఉద్యోగులు, ఇళ్లకు పరిమితమైన వారు, ప్రజాప్రతినిధుల పేర్లతో వర్క్ ఐడీలు పుట్టించి ఫీల్డ్ అసిస్టెంట్ నిధులు స్వాహా చేశాడంటూ ఫిర్యాదులు చేశారు. ఏపీడీ బాలోజీనాయక్, ఏపీఓ శ్రీకళారెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఫిర్యాదు చేసిన వారు ఎవరూ విచారణ వద్దకు రాకపోవడం విశేషం. మస్టర్లలో నమోదయిన ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, తదితర వారి వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఏపీడీ తెలిపారు.

పంచతంత్రం.. లక్ష్యం వందశాతం

- కేజీబీవీల్లో పది, ఇంటర్‌లో వందశాతం ఫలితాల సాధనకు కృషి
- ప్రారంభమైన స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి





నంద్యాల కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి బంగరు భవితకు బాట వేయాలన్నా.. ఉన్నత లక్ష్యం వైపు పయనించాలన్నా పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కులే కీలకం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పది, ఇంటర్‌లలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పంచతంత్ర పేరుతో ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు.

జిల్లాలో 27 కేజీబీవీలు...

జిల్లాలో 27 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో పదో తరగతికి సంబంధించి 1,020 మంది విద్యార్థులు చదువుతుండగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం 822, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 434 మంది చదువుతున్నారు. వీరందరి కోసం సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు ప్రత్యేకంగా పంచతంత్ర ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేజీ బీవీలో పనిచేస్తే ప్రిన్సిపాళ్లతో పాటు సీఆర్టీ, పీజీటీలు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు. ఏఏ సజెక్టుల్లో వెనుకబడి ఉన్నారనే అంశాలను పరిశీలిస్తూ.. ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ మొత్తం కార్యాచరణ అమలును కేజీబీవీల జీసీడీఓ పర్యవేక్షిస్తారు.

ప్రణాళిక ఇలా...

కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు రాష్ట్ర అధికారులు పంచతంత్ర పేరుతో వంద రోజుల ప్రణాళిక తయారు చేశారు. ఈ ప్రణాళిక అన్ని కేజీబీవీల్లో ఇప్పటికే ప్రారంభమైంది. ఇందుకోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 6.30 నుంచి సబ్జెక్టు ప్రిపరేషన్‌తో రోజు మొదలవుతుంది. రాత్రి 10గంటల వరకు ఆయా సబ్జెకులపై టెస్టులు, స్టడీ అవర్లు కొనసాగుతాయి. దీంతో పాటు ఎస్‌సీఈఆర్టీ మోడల్ పేపర్లను అందించి సాధన చేయిస్తున్నారు. వారంతపు పరీక్షలు, గ్రాండ్ టెస్టులు పెడుతున్నారు. దీంతో పాటు చదువులో వెనుకబడిన పిల్లలను సైతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు సీఆర్టీ, పీజీటీలతో పాటు ప్రిన్సిపాళ్లకు పలు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు గ్రాండ్ టెస్టులు, ఎనిమిది వారాంత పరీక్షలను నిర్వహించారు.

జిల్లాలో మొత్తం కేజీబీవీలు :	27
కేజీబీవీల్లో మొత్తం విద్యార్థినులు :	6609
పదో తరగతి విద్యార్థినులు :	1020
ఇంటర్ ప్రథమ సంవత్సరం :	822
ఇంటర్ ద్వితీయ సంవత్సరం :	434

కేజీబీవీలను సందర్శిస్తున్నాం



ఈ ఏడాది జిల్లాలోని అన్ని కేజీబీవీలలో ఉత్తమ ఫలితాల సాధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు అమలు చేస్తున్న పంచతంత్ర ప్రణాళికను పక్కగా అమలు చేస్తున్నాం. ఇందుకోసం ప్రతి రోజు ఒకటి రెండు కేజీబీవీలను సందర్శిస్తూ అక్కడ సిబ్బందితో పాటు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు సలహాలను ఇస్తున్నాం. కచ్చితంగా ఈ సారి మంచి మార్కులతో పాటు మంచి ఫలితాలను సాధిస్తాం.

– నాగసులోచన, జీసీడీఓ, నంద్యాల

ఉత్తమ మార్కులు సాధిస్తా



పదో తరగతి పరీక్షల కోసం కష్టపడి చదువుతున్నా. పరీక్షలో ఉత్తమ మార్కులు సాధిస్తా. ఇందుకోసం మా కేజీబీవీలో ప్రిన్సిపాల్, సీఆర్టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మమ్మల్ని చదివిస్తున్నారు. నేను బాగా చదివి మంచి మార్కులను సాధించి మా పాఠశాలతో పాటు మా ప్రిన్సిపాల్, సీఆర్టీలకు మంచి పేరు తీసుకొస్తా.

–అపురూప, పదో తరగతి విద్యార్థిని, మహానంది

వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి

మా కేజీబీవీలో ఈ ఏడాది పది, ఇంటర్‌లలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది పది, ఇంటర్ ఫస్ట్, సెకెండియర్లలో కలిసి 1,256 మంది విద్యార్థులు ఉన్నారు. వారంతా ఉత్తీర్ణత సాధించేందుకు సాధన చేయిస్తున్నాం.

– రమాదేవిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్, నంద్యాల

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న సీఐ వంశీధర్

శిరివెళ్ల: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సీఐ వంశీధర్ అన్నారు. గురువారం యర్రగుంట్ల విమలా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ట్రాఫిక్, చైల్డ్ మ్యారేజ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంత మంది తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారన్నారు. చదువు వయస్సులో వివాహాలు చేయడం వారి భవిష్యత్‌ను నాశనం చేసినట్లేనన్నారు. యుక్త వయస్సు 18 ఏళ్లు దాటిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. అలాగే రహదారి నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రయాణాల సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, ప్రిన్సిపాల్ అన్నాగ్రేస్, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చాగలమర్రి: రోడ్లపై ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, అలాగే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్ విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జి.శంకర్, కానిస్టేబుల్ శివకాంత్, వాసవి విద్యా సమాజం సెక్రటరి బొడ్డు పుల్లారెడ్డి, ట్రెజరర్ బింగుమళ్ల రామ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్డున పడ్డారన్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పి, ప్రతి కుటుంబంలో తల్లికి వందనం పేరుతో రూ.15వేలు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇంత వరకు ఊసేలేదన్నారు. అధికారం చేపట్టి 8 నెలలు కావస్తున్నా అమలు చేయడం విఫలమైందన్నారు. సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత, ముర్తుజాబీ, స్వాతి, సుశీలమ్మ, లక్ష్మీదేవి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సాగునీటి సంఘం వైస్ చైర్మన్ మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

ఉయ్యాలవాడ : మండల కేంద్రానికి చెందిన మిరపల్లె వెంకటేశ్వర్లు(42) కేసీ కెనాల్ సాగు నీటి సంఘం వైస్ చైర్మన్ గుండెపోటుతో గురువారం మృతి చెందారు. బంధువులు తెలిపిన సమాచారం మేరకు వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి కళ్లంలో మిరప దిగుబడుల వద్ద అర్ధరాత్రి వరకు కాపలా వుండి గృహానికి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారుజామున నిద్రా లేచి బాత్‌రూంకు వెళ్తూ స్పృహ కోల్పోయి కింద పడిపోయాడు. గమనించిన భార్య లక్ష్మీదేవి గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ పట్టణంలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గగ్గెర వెంకటేశ్వర్లు, మాజీ గ్రామ సర్పంచ్ పోచా రాధాకృష్ణారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు రాంచరణ్, కుమార్తె చంద్రలాస్య ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: బీసీ, ఈబీసీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. మండలానికి బీసీ యూనిట్లు 52, ఈబీసీలకు 3 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వాటికి బ్యాంక్‌ల వారీగా కేటాయింపులు జరిగాయన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందేనని వికలాంగుల హక్కు పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్షలాది మందితో డప్పుల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, రెవెన్యూ క్వార్టర్స్, సాయిబాబా నగర్, ప్రియాంక నగర్, డేనియల్‌పురం, ప్రథమనంది, బైటిపేట, మూలసాగరం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, రాయల్ కాంపౌండ్, విజయపురి కాలనీ, సాదిక్‌నగర్, తదితర ప్రాంతాల్లో తాగునీటిని సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. నగర పురపాలక పరిధిలో పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు గమనించాలన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్..

నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్, ఎన్‌జీఓ కాలనీలో పారిశుద్ధ్య పనులను కమిషనర్ నిరంజన్ రెడ్డి పరిశీలించారు. శానిటేషన్ పనులు సక్రమంగా చేయాలన్నారు. అలాగే డంపింగ్ యార్డును కూడా పరిశీలించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి ఎరువుల తయారీ కేంద్రానికి పంపాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

శిరివెళ్ల: స్థానిక 2వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ తేజస్వీని గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలోని చిన్నారుల హాజరు పట్టిక, పోషకాహార నిల్వల రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. చిన్నారులతో ప్రీ స్కూల్ మెటీరియల్‌ను తయారు చేయించి డిస్ప్లేజ్ చేయాలని వర్కర్లకు సూచించారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పోషకాహార పదార్థాలను అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

వీఆర్‌ఏ బహదూర్ బాషా మృతి

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బహదూర్ బాషా(55) గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఆర్‌ఐ అబ్దుల్ సత్తార్, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌లు గురువారం గ్రామానికి చెరుకోని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి, అతని భార్య మహబూబ్‌బీకి అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ తక్షణ సాయంగా రూ.25 వేలు అందజేశారు.

అభివృద్ధి పనులకు నేడు భూమిపూజ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని 14, 24, 25, 27, 34, 35 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా గురువారం తెలిపారు. భూమి పూజ కార్యక్రమానికి మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ తదితరులు హాజరవుతారన్నారు.

సుకన్య సమృద్ధి ఖాతాపై నేడు ప్రత్యేక డ్రైవ్

నంద్యాల(వ్యవసాయం): జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 24వ తేదీన నంద్యాల పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి ఖాతాపై స్పెషల్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని పోస్టు ఆఫీస్‌లలో నిర్వహించే డ్రైవ్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాలికల ప్రయోజనార్థం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి ఖాతా 10 సంవత్సరాలలోపు బాలికలందరికీ రూ.250 నామమాత్రపు రుసుముతో దగ్గరిలోని పోస్టు ఆఫీస్‌లలో ఖాతా తెరవవచ్చన్నారు.

కత్తెరపురుగు నివారణపై అవగాహన

రుద్రవరం: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగు నివారణపై ఆత్మ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ విభాగానికి చెందిన అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ హరిబాబు కత్తెర పురుగు నివారించుకోవాలో వివరించారు. లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్, ఏఈఓ రాజు, వీపీఏ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల కోసం వేధింపులు

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వంలో కార్పొరేట్ విద్యాసంస్థలు రోజురోజుకు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం విజయవాడ నడిబొడ్డున చైతన్య జూనియర్ కళాశాలలో ఫీజు కట్టలేదని, విద్యార్థిని, తండ్రిని రాత్రంతా కళాశాల గేటు వద్ద నిలబెట్టారన్నారు. అది మరువకముందే అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలలో ఫీజు కట్టలేదని కళాశాల యాజమాన్యం అందరి ముందు అవమానించడంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైన విద్యార్థి మూడవ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ సంఘటనను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థి కుటుంబానికి రూ.2కోట్లు నష్టపరిహారం అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆళ్లగడ్డ : పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాంప్రసాద్ (27) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన రాంప్రసాద్ ఈ నెల 15వ తేదీ అహోబిలం క్షేత్రంలో జరిగిన పార్వేట ఉత్సవంలో పాల్గొని బైకుపై స్వగ్రామానికి వస్తుండగా.. ఆళ్లగడ్డ కోర్టు వద్ద గుర్తుతెలియని బైకు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగ గాయపడ్డ రాంప్రసాద్‌ను బెంగళూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుని తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నగీన తెలిపారు.

మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకు 'ఉల్లాస్'

చాగలమర్రి: నిరక్షరాస్యులైన వయోజన మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా విద్యను నేర్పించటానికి ప్రభుత్వం వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2వ విడత 100 మంది వలంటీర్లకు చేపట్టిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 15 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల నిరక్షరాస్యులైన మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 3 నెలలపాటు విద్యను నేర్పించటానికి 100 మంది వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్యాధికారి ఫయాజ్, సీసీలు చిన్నమ్మ, సాజిదా, మస్తానమ్మ, దిల్‌షాద్ తదితరులు పాల్గొన్నారు.

436 మంది దివ్యాంగులకు వైద్యపరీక్షలు

గోస్పాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ పొందుతున్న దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసేలా ప్రత్యేక క్యాంపు నిర్వహించినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో మూడు రోజుల పాటు దివ్యాంగులకు నిర్వహించిన సదరం వైద్య పరీక్షల కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపు ద్వారా మూడు రోజుల పాటు 453 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, 436 మంది కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు.

మార్చినాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

రుద్రవరం: మార్చి నెలాఖరు నాటికి గృహనిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. 90రోజుల ప్రణాళికలో భాగంగా మంజూరైన 62 ఇళ్ల నిర్మాణాల వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మరుగుదొడ్లు కూడా నిర్మించుకోనేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ ప్రతాప్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శకుడు నేతాజీ



డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): యువత లక్ష్య సాధనలో యువతకు నేతాజీ మార్గదర్శకుడని డాక్టర్ గెలివి సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపకులు లలితాసరస్వతి, కమాల్‌ఖాన్, ఆంద్రూస్, తదితరులు పాల్గొన్నారు. రావూస్ కళాశాలలో జరిగిన వేడుకల్లో పార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, రావూస్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, వేణురెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు. డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు డీపీ మస్తాన్‌వలి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, సభ్యులు ఖాదర్‌బాషా, హుసేన్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొట్టె చంద్రశేఖర్, ఇనుగురి రమేష్ బాబు, లక్ష్మిరెడ్డి, ఉపేంద్రనాథరెడ్డి. మధు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఐడీకే శాస్త్రి ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్, మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి, సుబ్రమణ్యం, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: ఏపీమోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు నేతాజీ చిత్రపాటానికి పూలమల వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఎరుకలిస్వామి ఆరాధన



ఆరాధనలో పాల్గొన్న భక్తులు



ఎరుకలిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఆకట్టుకున్న ప్రియవర్ధిని కూచిపూడి నాట్యం

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడులో వెలసిన శ్రీ ఆదిఅల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన ఉత్సవాన్ని గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పి.బాలిరెడ్డి, సిద్దిసత్యనారాయణ, అక్కల శివయ్యల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులంతా పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గోపూజ, ప్రాతఃకాల పూజ, అభిషేకం అనంతరం భగవద్గీత పారాయణం, మహా మంగళహారతి, భజన కార్యక్రమం నిర్వహించారు. అనతంరం నిర్వహించిన ప్రియవర్ధిని కూచిపూడి నాట్యం ఆకట్టుకోగా, రాత్రి భక్తజన చింతామణి పూర్తి నాటకం రంజింపజేసింది. అనంతరం భక్త చింతామణి నాటకానికి ఆర్థిక సాయం అందించిన దాతలు నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ బబ్బూరి వెంకటస్వామి, పారిశ్రామికవేత్త బబ్బూరి కృష్ణయ్యలను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విశ్వనగర్‌లో పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 9 వార్డుల్లో జరగనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన పనులకు మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ గురువారం శంకుస్థాపన చేశారు. 17వ వార్డు విశ్వనగర్, 18వ వార్డు ఎన్‌జీఓ కాలనీ, పొన్నాపురం కాలనీ, నూనెపల్లె, క్రాంతినగర్, రైతునగర్, జ్ఞానాపురం, పెద్దబండ, ఉప్పరిపేట, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డితో పాటు పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొయ్యి పూడ్చారు

సాక్షి ఎఫెక్ట్



నేడు గొయ్యిని పూడ్చివేసిన దృశ్యం



నాడు ప్రమాదకరంగా రోడ్డుపై గొయ్యి

దొర్నిపాడు: కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట నుంచి దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెకు వెళ్లేదారిలో కల్వర్టుపై గొయ్యి పడ్డంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. గొయ్యి ఉందని తెలియక చాలా వాహనదారులు అక్కడ ప్రమాదాలకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఈనెల 20న 'అదుపు తప్పితే అంతే' శీర్షికన సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు గొయ్యిని పూడ్చి అగచాట్లు తీర్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.